నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
02.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
22 జనవరి 2025
పేజీలు 8


### విశ్వంలో జలాశయం

విశ్వంలో ఓ జలాశయాన్ని (Colossal Water Reservoir) జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీ శాస్త్రవేత్త (నాసా)లు కనుగొన్నారు. భూమి నుంచి 1200 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని క్వాసర్ (బ్లాక్ హోల్స్ కలిగిన శక్తి ఉత్పత్తి కేంద్రం) వద్ద ఉంది. ఇది సూర్యుడి కంటే 2000 రెట్లు పెద్దదని, ఇక్కడి నుంచి 1000 లక్షల సూర్యులతో సమానమైన శక్తి బయటకు వస్తుందని తెలిపారు. భూమిపై గల మహా సముద్రాల్లోని నీటి మొత్తం కంటే ఈ జలాశయంలోని నీరు 140 లక్షల కోట్ల రెట్లు ఎక్కువ.

# ఆర్‌బీఐ.. ఆర్థిక స్థిరత్వం - ఆర్థికాభివృద్ధే లక్ష్యం

## భారతీయ రిజర్వ్ బ్యాంక్

- బ్యాంకింగ్ వ్యవస్థకు శిఖర సంస్థ, భారత ఆర్థిక వ్యవస్థలో కేంద్ర బ్యాంక్ భారత రిజర్వ్ బ్యాంక్. బ్యాంకింగ్ వ్యవస్థను నియంత్రిస్తూ మార్గదర్శిగా పని చేయడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడటం, ఆర్థికాభివృద్ధికి దోహదపడటం కేంద్ర బ్యాంక్ విధి.
- 1656లో రిక్స్ బ్యాంక్ ఆఫ్ స్వీడన్‌ను ఏర్పాటు చేశారు. ఇది ప్రపంచంలోనే మొదటి కేంద్ర బ్యాంక్. ఇది 1668 నుంచి పని చేస్తుంది.
- 1694లో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ను ఏర్పాటు చేశారు. ఈ బ్యాంకును ప్రపంచ కేంద్ర బ్యాంకులకు తల్లి వంటిదని పిలుస్తారు.
- 1913లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంకును యూఎస్ఏలో ఏర్పాటు చేశారు.
- భారత్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)ను 1935లో ఏర్పాటు చేశారు.

**భారతీయ రిజర్వ్ బ్యాంక్**

- దేశంలో 1921లో ఇంపీరియల్ బ్యాంకును నెలకొల్పారు. ఈ బ్యాంకు తాత్కాలికంగా కేంద్రీయ బ్యాంకు వలె పనిచేసింది. కానీ సమర్థవంతంగా పని చేయలేదు.
- 1926లో హిల్టన్ యంగ్ కమిషన్ అనే రాయల్ కమిషన్ దేశంలో ప్రత్యేకంగా ఒక కేంద్ర బ్యాంకును నెలకొల్పాలని సూచించింది. 1931లో కేంద్ర బ్యాంక్ విచారణ సంఘం కేంద్ర బ్యాంక్ ఏర్పాటు చేయమని సూచించింది.
- 1934, మార్చి 5న భారతీయ రిజర్వ్ బ్యాంకు చట్టం ఆమోదించింది. 1935, ఏప్రిల్ 1న నెలకొల్పారు.
- ఈ బ్యాంకు రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైంది.
- ఆర్‌బీఐ ఏర్పడినప్పుడు అధిక వాటా ప్రైవేట్ వారిది. ఒక ప్రైవేట్ వారి షేర్ విలువ రూ.100.
- ఆర్‌బీఐని 1949, జనవరి 1న జాతీయం చేశారు.
- ఆర్‌బీఐ మొదటి ప్రధాన కేంద్రం కలకత్తా కాగా 1937లో బొంబాయికి మార్చారు.
- గతంలో ఆర్‌బీఐ ఆర్థిక సంవత్సరం జూలై 1 నుంచి జూన్ 30 కాగా బిమల్ జలాన్ కమిటీ సిఫారసుల మేరకు 2021-22 నుంచి ఏప్రిల్ 1న ప్రారంభమై మార్చి 31న ముగుస్తుంది.

**గమనిక:** 1806- బ్యాంక్ ఆఫ్ కలకత్తా (1809లో దీన్ని బ్యాంక్ ఆఫ్ బెంగాల్‌గా మార్చారు), 1840- బ్యాంక్ ఆఫ్ బాంబే, 1843- బ్యాంక్ ఆఫ్ మద్రాస్‌లను ప్రెసిడెన్సీ బ్యాంకులు అంటారు.

- 1921లో ఈ మూడు బ్యాంకులను ఇంపీరియల్ బ్యాంకులో విలీనం చేశారు. కొంత కాలం తాత్కాలిక కేంద్రీయ బ్యాంకు వలె పని చేసింది. ఆర్‌బీఐ ఏర్పడిన తర్వాత ఇంపీరియల్ బ్యాంక్‌ను వాణిజ్య బ్యాంకుగా మార్చారు. 1955లో ఇంపీరియల్ బ్యాంకును ఎస్‌బీఐగా మార్చారు.

**ఆర్‌బీఐ జోనల్ కార్యాలయాలు**

1) కలకత్తా 2) చెన్నై 3) ఢిల్లీ 4) ముంబై

- ఆర్‌బీఐకు 31 ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి.
- ఆర్‌బీఐ మొదటి గవర్నర్- ఓస్‌బ్రోన్ స్మిత్ (1935, ఏప్రిల్ 12 - 1937, జూన్ 30)
- ఆర్‌బీఐ మొదటి భారతీయ గవర్నర్- చింతామన్ ద్వారకానాథ్ దేశ్‌ముఖ్ (సీడీ దేశ్‌ముఖ్)
- ఆర్‌బీఐ గవర్నర్‌గా ఎక్కువ కాలం పనిచేసినది- బెనెగల్ రామారావు
- శక్తికాంత దాస్ ఆర్‌బీఐ గవర్నర్(25వ)గా 2018, డిసెంబర్ 12 నుంచి 2024, డిసెంబర్ 10 వరకు పని చేశారు.
- ప్రస్తుత ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా (26వ గవర్నర్) (2024, డిసెంబర్ 11)




- ఆర్‌బీఐ గవర్నర్‌ను ప్రధాన మంత్రి అధ్యక్షతన గల 'క్యాబినెట్ కమిటీ ఆన్ అపాయింట్‌మెంట్స్' ఎంపిక చేసి నియమిస్తుంది.

**ఆర్‌బీఐ శిక్షణ కేంద్రాలు**

1) రిజర్వ్ బ్యాంక్ స్టాఫ్ కాలేజీ- చెన్నై
2) కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ బ్యాంకింగ్- పుణె
3) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్- పుణె
4) ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రీసర్చ్- ముంబయి
5) ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ- హైదరాబాద్
6) ఆర్‌బీఐ అకాడమీ- ముంబయి

**ఆర్‌బీఐ విధులు**

- పేపర్ కరెన్సీ యాక్ట్-1861 ప్రకారం కరెన్సీ ముద్రించే గుత్తాధిపత్యం ప్రభుత్వానికి వచ్చింది.
- 1934 రిజర్వ్ బ్యాంక్ చట్టం 22వ సెక్షన్ కింద రూపాయి నోటు, నాణేలు తప్ప అన్ని కరెన్సీ నోట్ల ముద్రణకు సంబంధించిన గుత్తాధిపత్యం ఆర్‌బీఐ కలిగి ఉంది.
- రూపాయి నోటును, నాణేలను ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసినప్పటికీ పంపిణీ బాధ్యత ఆర్‌బీఐకి అప్పగించారు.
- 1956 వరకు అనుపాత నిల్వల పద్ధతి ప్రకారం 40 శాతం బంగారం, విదేశీ మారక ద్రవ్యం నిల్వ చూపించాలి.
- 1957లో సవరించి, కనిష్ఠ నిల్వల పద్ధతిని ప్రవేశ పెట్టారు.
- కనీస నిల్వ= రూ. 200 కోట్లు (115 కోట్లు బంగారం+85 కోట్లు విదేశీ కరెన్సీ)

**నూతన కరెన్సీ ముద్రణకు ఆధారం**

1) వస్తుసేవల ఉత్పత్తి 2) బడ్జెట్ లోటు
3) ద్రవ్యోల్బణం 4) బంగారం నిల్వ

- ద్రవ్యాన్ని అధికంగా ముద్రిస్తే ద్రవ్య సరఫరా అధికమై ద్రవ్యోల్బణం పెరుగుతుంది.
- 2010లో తమిళనాడుకు చెందిన డీ ఉదయ్ కుమార్ రూపాయికి విశిష్ఠ చిహ్నం ₹ (దేవరనాగరి లిపి)ను రూపొందించారు.

**కరెన్సీ నోట్లను ముద్రించే ప్రాంతాలు**

1) ఇండియన్ సెక్యూరిటీ ప్రెస్- నాసిక్ (మహారాష్ట్ర- 1928). చిన్న మొత్తాల పొదుపు సర్టిఫికెట్లు, స్టాంప్స్, రెవెన్యూ స్టాంప్స్ ముద్రిస్తారు.
2) కరెన్సీ నోట్స్ ప్రెస్- నాసిక్ (మహారాష్ట్ర- 1928). రూ. 1 నుంచి రూ. 100 వరకు ముద్రణ.
3) కాగిత కరెన్సీకి అవసరమైన పేపర్‌ను ఉత్పత్తి చేస్తున్నది- సెక్యూరిటీ పేపర్ నోట్స్ ప్రెస్ (హోషంగాబాద్, మధ్యప్రదేశ్-1967)
4) బ్యాంక్ నోట్స్ ప్రెస్- దీవాస్ (మధ్యప్రదేశ్ 1974). రూ. 20 నుంచి 500 వరకు ముద్రణ.
5) కరెన్సీ నోట్ల తయారీకి వాడే ఇంక్- దీవాస్ ఇక్ ఫ్యాక్టరీ (మధ్యప్రదేశ్ 1974)
6) సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్ దక్షిణ భారత దేశ అవసరాలకు పోస్టల్ స్టాంప్స్, రెవెన్యూ స్టాంప్స్ ముద్రణ.
7) బీఆర్‌బీఎన్ఎంఎల్- భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణాలయ లిమిటెడ్ (బెంగళూరు 1995). దీనిలో అత్యంత అధునాతనమైన ముద్రణ కేంద్రాలు కర్ణాటకలోని మైసూర్, పశ్చిమ బెంగాల్‌లోని సాలోబోని వద్ద ఉన్నాయి.
8) మింట్స్- టంకశాలలు
ఎ. హైదరాబాద్ బి. ముంబయి
సి. కోల్‌కతా డి. నోయిడా

- హైదరాబాద్‌లో తయారయ్యే నాణేలు స్టార్ గుర్తును కలిగి ఉంటాయి.
- ముంబయిలో తయారయ్యే నాణేలు డైమండ్ గుర్తును కలిగి ఉంటాయి.
- కోల్‌కతాలో తయారయ్యే నాణేలు ఎలాంటి గుర్తు కలిగి ఉండవు
- నోయిడాలో తయారయ్యే నాణేలు డైమండ్ గుర్తును కలిగి ఉంటాయి.

**ప్రభుత్వానికి బ్యాంక్**

- ఆర్‌బీఐ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి బ్యాంకుగా, ఏజెంటుగా పని చేస్తుంది. ప్రభుత్వ నగదును డిపాజిట్ల రూపంలో స్వీకరిస్తుంది. ప్రజల నుంచి, వివిధ సంస్థల నుంచి ప్రభుత్వానికి రావాల్సిన రాబడులను స్వీకరించి ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తుంది. ప్రభుత్వం ఇతరులకు చేయాల్సిన చెల్లింపులకు ప్రభుత్వం తరపున చెల్లిస్తుంది.
- ప్రభుత్వం జారీ చేసే ట్రెజరీ బిల్లులను విక్రయిస్తుంది. ప్రభుత్వ రుణ బాధ్యతను నిర్వహిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున రుణాలను స్వీకరిస్తుంది.
- ప్రభుత్వాలకు ద్రవ్య కొరత ఏర్పడినప్పుడు తాత్కాలికంగా ఉపశమనం కల్పిస్తూ 90 రోజుల గడువు మించిన వేస్ అండ్ మీన్స్ రుణాలను అందిస్తుంది.
- కొన్ని అత్యవసర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం కల్పిస్తుంది.

**బ్యాంకులకు బ్యాంక్**

- ఆర్‌బీఐ దేశంలోని అన్ని బ్యాంకులకు బ్యాంకుగా పని చేస్తుంది. 1934 రిజర్వ్ బ్యాంక్ చట్టం ప్రకారం 1949 బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని అన్ని బ్యాంకులను నియంత్రించే అధికారం రిజర్వ్ బ్యాంక్ కలిగి ఉంది. కొత్త వాణిజ్య బ్యాంకును నెలకొల్పాలన్నా, బ్యాంక్ కొత్త శాఖను ప్రారంభించాలన్నా రిజర్వ్ బ్యాంక్ అనుమతి పొందాలి.

**పరపతి నియంత్రణ**

- ద్రవ్యంలో బ్యాంక్ పరపతి ఒక ముఖ్యమైన భాగం. పరపతి పరిమాణంలో హెచ్చుతగ్గుల కారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణ, ప్రతి ద్రవ్యోల్బణ పరిస్థితులు ఏర్పడతాయి.
- వాటిని నివారించడం కోసం ఆర్‌బీఐ పరపతి నియంత్రణ చర్యలు చేపడుతుంది. ఇవి ఆర్‌బీఐ ద్రవ్య విధానంలో ఒక భాగం.
- పరపతి నియంత్రణ పద్ధతులు స్థూలంగా 2 రకాలు. అవి..
  1) పరిమాణాత్మక నియంత్రణ పద్ధతి
  2) గుణాత్మక నియంత్రణ పద్ధతి

**విదేశీ మారక ద్రవ్య నిల్వల పరిరక్షణ**

- విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టం ప్రకారం దేశ రూపాయి బాహ్య విలువను స్థిరంగా ఉంచే బాధ్యత రిజర్వ్ బ్యాంక్‌ది.
- రూపాయి మారకపు రేటులో మార్పులను తొలగించి స్థిరంగా ఉంచడానికి ఆర్‌బీఐ విదేశీ కరెన్సీని నిల్వ చేయాలి.

**గ్రూప్స్ ప్రత్యేకం ఎకానమీ**

- దేశంలో విదేశీ కరెన్సీ కొనుగోళ్లకు, అమ్మకాలను వినియోగాన్ని కొన్ని షరతులకు లోబడి నియంత్రిస్తుంది.

**క్లియరింగ్ హౌస్ యూనిట్**

- ఒక వాణిజ్య బ్యాంక్ ఇతర బ్యాంకులకు చెల్లించాల్సిన మొత్తాలకు, వసూలు చేసిన మొత్తాలకు ఈ యూనిట్ వద్ద క్లియరెన్స్ చేసుకుంటాయి.
- వివిధ బ్యాంకుల మధ్య చెలామణి అయ్యే చెక్కులు, డీడీలు ఆర్‌బీఐ క్లియరింగ్ హౌస్ యూనిట్ వద్ద క్లియరెన్స్ చేస్తుంది.

**పర్యవేక్షణ విధులు**

- బ్యాంకింగ్ వ్యవస్థకు శిఖర సంస్థగా ఆర్‌బీఐ దేశంలోని అన్ని బ్యాంకింగ్ సంస్థలపై నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యత కలిగి ఉంటుంది. తద్వారా డిపాజిటర్ల ప్రయోజనాలు కాపాడటమే కాకుండా బ్యాంకులు తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ఆర్థికాభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకుంటుంది. ఆర్‌బీఐ పర్యవేక్షణ విధులను కింది విధంగా పేర్కొనవచ్చు.

ఎ. కొత్తగా బ్యాంకులు ఏర్పాటు చేయడానికి, కొత్త శాఖ కార్యాలయాలు ప్రారంభించడానికి లైసెన్సులు ఇవ్వడం
బి. నియమ నిబంధనలకు అనుగుణంగా బ్యాంకులు పని చేస్తున్నదీ లేనిదీ తనిఖీ చేయడం
సి. మూలధన పరిమితిని, నగదు నిల్వల నియమాలను రూపొందించడం, వడ్డీ రేట్ల నియమాలపై సూచనలు, ఆదేశాలు ఇస్తుంది.
డి. డిపాజిట్లు, రుణాలు, పెట్టుబడులకు సంబంధించిన గణాంకాలు సేకరించడం, ప్రచురించడం చేస్తుంది.
ఇ. బ్యాంక్ సిబ్బందికి సంస్థాగత శిక్షణ ఏర్పాటు చేస్తుంది.

**అభివృద్ధిపరమైన విధులు**

**డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ)**

- 1978లో బొంబాయి ప్రధాన కేంద్రంగా స్థాపన. ఆర్‌బీఐ వాటా 100 శాతం.
- షెడ్యూల్ వాణిజ్య బ్యాంకులో నగదు డిపాజిట్ చేసిన ఖాతాదారులందరికీ గ్యారంటీ అందిస్తుంది.
- బ్యాంక్ ఖాయిలా పడితే గరిష్ఠంగా రూ. 5 లక్షల వరకు పరిహారం అందిస్తుంది.

**నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బి)**

- 1988 న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా స్థాపన.
- 2018లో కేంద్ర బడ్జెట్‌లో ఆర్‌బీఐ వాటాలను కేంద్రం కొనుగోలు చేస్తుందని ప్రకటన
- 2019, ఏప్రిల్ నుంచి భారత ప్రభుత్వానికి ఆర్‌బీఐ వాటాలు బదిలీ.
- దేశంలో అత్యున్నత స్థాయి గృహ నిర్మాణ రుణాలు అందించే సంస్థ. నేరుగా ప్రజలకు రుణాలు అందించదు.

**నాబార్డ్ (నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)**

- 1982లో బొంబాయి ప్రధాన కేంద్రంగా స్థాపన.
- వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి రుణాలను అందించే రీ ఫైనాన్స్ ఇన్‌స్టిట్యూట్ (నేరుగా ప్రజలకు రుణాలు అందించదు)
- ప్రస్తుతం నాబార్డ్‌లో కేంద్రం వాటా 100 శాతం

**పారిశ్రామికాభివృద్ధి**

- పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడానికి కింది సంస్థలను ప్రారంభించింది.

**ఉదా:** ఐడీబీఐ

- ఐడీబీఐని పారిశ్రామిక రంగానికి అపెక్స్ సంస్థగా పేర్కొంటారు.

## మాదిరి ప్రశ్నలు

1. ఆర్‌బీఐ కేంద్ర కార్యాలయం ఎక్కడ ఉంది?
   1) ముంబై 2) ఢిల్లీ
   3) కోల్‌కతా 4) చెన్నై
2. భారత రిజర్వ్ బ్యాంక్‌ను ఎప్పుడు జాతీయం చేశారు?
   1) 1947 2) 1949
   3) 1950 4) 1969
3. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఎప్పుడు స్థాపించారు?
   1) 1934 2) 1935
   3) 1937 4) 1950
4. ఆర్‌బీఐని ఏర్పాటు చేయమని సిఫారసు చేసిన కమిషన్?
   1) ప్రణాళిక సంఘం
   2) ఆర్థిక సంఘం
   3) హిల్టన్ యంగ్
   4) కేంద్ర ప్రభుత్వం
5. దేశంలో కాగిత కరెన్సీ నోట్ల చట్టాన్ని ప్రవేశ పెట్టిన సంవత్సరం?
   1) 1860 2) 1861
   3) 1862 4) 1863

**సమాధానాలు**

1-1, 2-2, 3-2, 4-3, 5-2.


పన్నాల శ్రవణ్ కుమార్
ఎకనామిక్స్ ఫ్యాకల్టీ,
9866709280
హైదరాబాద్


